

ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లికార్జున



చాకిచర్లలో ఎడ్ల పందేలు



కనిగిరిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్



అయ్యలూరివారిపల్లెలో గ్రామోత్సవం

ప్రతి ఇంటా సంక్రాంతి సంబరం



బంగారు ఆభరణాల తొడుగులో అయ్యప్ప మూల విగ్రహమూర్తి



పామూరు: బంగారు చీర అలంకరణతో వాసవీమాత మూలవిగ్రహమూర్తి



విశిష్ట అలంకరణలో నారాయణస్వామి విగ్రహమూర్తి



తెప్పోత్సవం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి



కె.ఉప్పలపాడులో గ్రామోత్సవం



సింగరాయకొండ కోదండరామస్వామి దేవస్థానంలో పారువేట

కనిగిరిరూరల్: సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలతో మూడు రోజులు పల్లె సీమలు కళకళలాడాయి. పల్లె సీమల్లో గ్రామీణ క్రీడలు, ఆటలతో సందడి నెలకొంది. కుర్రకారు, యువత పండగ సంబరాల్లో ఉత్సాహంగా గడిపారు. బుధవారం పలు పలు చోట్ల వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందచేశారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ ముగ్గుల, ఆటల పోటీల్లోని విజేతలకు బహుమతులు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కౌన్సిలర్ కామిశెట్టి దీప, సిరియా షాపింగ్ మాల్ యజమాని వెంకటాద్రి, టీడీపీ నాయకుడు దోద్దా వెంకట సుబ్బారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజేతల సంస్థల అధినేత పసుపులేటి అరుణోదర్, వివిధ సంఘాల నాయకులు పందిటి మోహన్, జీపీ రామారావు, ఎస్‌కే ఖాశింపీరా, సీహెచ్ పవన్ కళ్యాన్, గుజ్జుల బాలిరెడ్డి, ఎస్‌కే నజీముద్దిన్, సయ్యద్ ఇస్రాజ్, జీ సురేష్, అంజమ్మ, పుట్టా సుబ్బారావు, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరు: మండలంలో అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు గ్రామాలు కళకళలాడాయి. మంగళవారం సంక్రాంతిని, బుధవారం భోగి పండుగను పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. పొన్నలూరులో రామాలయం యూత్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ చైర్ పోటీలు, చిన్నారులతో డ్యాన్సులు, చెంచులక్ష్మి పౌరాణిక నాటికతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పామూరు: మూడు రోజుల సంక్రాంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద వాసవీక్లబ్స్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘం మండల అధ్యక్షుడు యేల్చూరి బాలకొండలు అధ్యక్షతన ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. అదేవిధంగా డి.వి.పాలెంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించారు. అయ్యప్ప ఆలయంలో ఆలయ చైర్మన్‌లు గుత్తి వెంకటరాజా, కావేటి సుబ్బయ్యల ఆధ్వర్యంలో మెట్లపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మూలవిగ్రహమూర్తి స్వర్ణ ఆభరణాలను స్థానిక మదన వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నుంచి భజంత్రీల మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గురుస్వామి, ఆలయ చైర్మన్‌లు తలపైపెట్టుకుని ఉత్సవంగా ఆలయానికి తీసుకువచ్చి స్వామిని అలంకరించారు. గురుస్వామి చిమట పట్టాభి, కార్తీక్, నాయకులు ఇర్రి కోటిరెడ్డి, భక్తులు, మహిళలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వల్లూరులోని వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జమ్ములపాలెంలో సీతారాముల స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. పొందూరు, టంగుటూరులోని ఆలయాల్లో భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేశారు.

హనుమంతునిపాడు: మండలంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పండుగకు కొత్త అల్లులు, బంధుమిత్రుల రాకతో పల్లెలు కళకళాడాయి. ఇళ్ల ముందు సంక్రాంతి రంగవల్లులతో ఇళ్ల ముందు కళకళాడాయి.

కొండపి: మండలంలో అన్ని గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముందు రంగవల్లులను అందంగా తీర్చదిద్దారు. గ్రామాల్లో యువత ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. పండుగ కోసం నగర ప్రజలు స్వగ్రామాలకు రావడంతో సందడి నెలకొంది. కొండపి గ్రామ సచివాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలు, బకెట్లో బంతి, లెమన్ స్పూన్ వంటి తదితర ఆటల పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. మండలంలోని కె.ఉప్పలపాడు శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి గ్రామోత్సవం కనులపండువగా సాగింది. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో నారాయణస్వామికి రథోత్సవం కనులపండువగా సాగింది. అయ్యలూరివారిపల్లెలో కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా తిరుమలనాథస్వామి కొండపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథస్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజనా వెంకటరెడ్డి, సర్పంచ్ ముత్యాల భారతీ, నారాయణరెడ్డి, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ పాల్గొన్నారు.

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ తల్లి తెప్పోత్సవం బుధవారం కనులపండువగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తెప్పోత్సవాన్ని తిలకించారు. అనంతరం అమ్మవారికి గ్రామోత్సవం, ఆలయ నిర్వహకులు ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. ఆలయ ఈఓ రమేష్ భక్తులకు అన్ని ఏర్పాటు చేశారు. అలాగే టంగుటూరు, మర్లపాడులో వేణుగోపాలస్వాములకు తెప్పోత్సవం నిర్వహించారు.

సింగరాయకొండ: మండలంలోని అన్ని ఆలయాల్లో బుధవారం కనుమ పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని కోదండరామస్వామి దేవస్థానంలో స్వామి పారువేట కనులపండువగా సాగింది. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కనుమళ్ల పంచాయతీలోని పెద్ద కనుమళ్ల, చిన్న కనుమళ్లలోని రామాలయాల్లో రాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది రాముల వారికి కనుమళ్ల చెరువులో తెప్పోత్సవం నిర్వహించాల్సి ఉనాన్ సింగరాయకొండ పంచాయతీ నుంచి మురుగునీరు చెరువులో కలుస్తుండటంతో తెప్పోత్సవం నిర్వహించటం లేదని గ్రామస్తులు తెలిపారు.



పొన్నలూరు రామాలయం వద్ద చెంచులక్ష్మి పౌరాణిక నాటిక ప్రదర్శన



శ్రీశ్రీనగర్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేత



మర్రిపూడిలో విజేతలకు బహుమతులు అందజేత



పొన్నలూరులో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

ఉలవపాడు: మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చాకిచర్లలో ఎడ్ల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. కరేడులో కబడ్డీ పోటీలు, రామకృష్ణాపురం గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. చాకిచర్లలో ఎడ్ల పోటీల్లో ప్రథమ బహుమతిని రూ.7,100, రెండో బహుమతి రూ.6,100, మూడో బహుమతి రూ.5,100, నాల్గవ బహుమతి రూ.4,100, ఐదో బహుమతి రూ.3,100, ఆరో బహుమతి రూ.2,100 బహుమతులు అందజేశారు. పోటీలను వైఎస్సార్ సీపీ బీసీ సంఘ నాయకుడు తోట మల్లికార్జున ప్రారంభించారు. చాకిచర్ల శ్రీశ్రీ నగర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించి మహిళలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

మర్రిపూడి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మర్రిపూడి పడమటి బజారులోని రామాలయం వద్ద వైఎస్సార్ సీపీ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. పోటీలకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లీలావతి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.



కొండపిలో ముగ్గుల పోటీలు



మ్యూజికల్ చైర్స్ ఆటలో పాల్గొన్న మహిళలు

రెచ్చిపోయిన పందెంరాయుళ్లు

- యథేచ్ఛగా కోడి పందేలు
- అనుమతులు ఉన్నాయంటూ ప్రచారం
- బారికేడ్లు కట్టి, టెంట్లు వేసి పందేల నిర్వహణ
- ఫొటోలు, వీడియోలు తీయకుండా పర్యవేక్షణ

కందుకూరు రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో యథేచ్ఛగా కోడి పందేలు నిర్వహించారు. నిర్వాహకులు ఏకంగా అనుమతులు ఉన్నాయంటూ ప్రచారం చేయడం ఇక్కడ విశేషం. కోడి పందేల నిర్వహణకు ప్రత్యేకంగా టెంట్లు, బారికేడ్లు కట్టి పందేలు నిర్వహించారు. మండలంలోని పలుకూరు పంచాయతీ పరిధిలో ఉన్న పత్తిపాటివారిపాలెం సమీపంలో పందేలు నిర్వహించారు. పలుకూరు గ్రామానికి చెందిన కొందరు నాయకులు అధికార పార్టీ పెద్దల అండదండలతో కోడి పందేలు ఇష్టానుసారంగా కొనసాగించారు. నాయకులు, పోలీసుల అనుమతి తెచ్చుకున్నామని, ఎటువంటి దాడులు జరగవని చుట్టుపక్కల గ్రామాల్లో ప్రచారం చేసుకున్నారు. దీంతో మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కోడి పందెంరాయుళ్లు పోటీలకు పగబడ్డారు.

ప్రత్యేక పర్యవేక్షణ..పట్టించుకోని పోలీసులు

కోడి పందేల నిర్వాహణకు నిర్వాహకులు పక్కాగా ఏర్పాట్లు చేశారు. కోడిపందేలకు వచ్చే వారు ఫొటోలు, వీడియోలు తీయకుండా పర్యవేక్షణ చేశారు. అయితే పందేలు నిర్వహణకు అనుమతులు ఉంటే అంత భయం ఎందుకని పలువురు నిర్వాహకులతో వాదనకు దిగారు. అయితే పోలీసులు మాత్రం విషయం తెలిసినా మామూళ్ల మత్తులో ఆ వైపు కూడా చూడలేదు. దీంతో ఆ గ్రామంలో మూడురోజుల పాటు పందేలు సాగాయి. రూ.5 నుంచి రూ.50 వేల వరకు పందెం జరిగాయి. మొత్తం లక్షల్లో చేతులు మారినట్లు తెలిసింది. మూడు రోజుల పాటు లక్షల రూపాయల పందెం జరిగింది. ఇలాంటి కోడి పందెలు, జూదం వంటి వాటికి బానిసలై యువత పక్కదారి పడుతుంది. ఒక పండుగ రోజు అనుకుంటే అది పొరపడినట్లే. ఇదే వ్యసనం కొనసాగి కుటుంబాలు గుల్ల అవకత తప్పదు.



కోడి పందేలు వీక్షిస్తున్న జనాలు



సీఎస్‌పురం మండలంలో నిర్వహిస్తున్న కోడి పందేలు

సీఎస్‌పురం(పామూరు): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సీఎస్‌పురం, పామూరు మండలాల్లో కోడిపందాలు నిర్వహించారు. సీఎస్‌పురం మండలంలో బోడావులదిన్నె, నాగులవరం, పామూరు మండలంలో కోడిగుంపల, దొడ్డవెంకటపల్లె గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో నిర్వహించారు. ఓవైపు పోలీసులు ప్రత్యేక నిఘాపెట్టినా పోలీసుల కళ్లుగప్పి కోడి పందేలు నిర్వహించారు. పందేల్లో రు. లక్షల్లో చేతులు మారినట్లు సమాచారం.



పలుకూరులో కోడి పందేలు

ఉదయం 7 గంటల నుంచే..

- పండుగ నాడు ఉదయాన్నే తెరుచుకున్న మద్యం దుకాణాలు
- నిబంధనలను అతిక్రమించి అమ్మకాలు
- చోద్యం చూసిన ఎక్సైజ్ శాఖాధికారులు

సింగరాయకొండ: సంక్రాంతి పండుగ నాడు మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనలను గాలికొదిలేశారు. ఉదయం 7 గంటల కల్లా మద్యం దుకాణాల్లో ఎక్కువ శాతం తెరిచి అమ్మకాలు కొనసాగించారు. నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే విక్రయాలు కొనసాగించాలి. కానీ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మద్యం దుకాణాల నిర్వాహకులు పూర్తిగా నిబంధనలకు నీళ్లొదిలేశారు. దీంతో ఉదయం నుంచే గ్రామాల్లో మద్యం ఏరులై పారింది. నియోజకవర్గంలో అధిక శాతం దుకాణాలన్నీ ఉదయాన్నే తెరుచుకున్నాయి. కానీ ఎక్సైజ్ శాఖాధికారులు మాత్రం అదేం లేదని బుకాయించడం గమనార్హం.

మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

నియోజకవర్గంలోని సింగరాయకొండ, కొండపి, పొన్నలూరు, జరుగుమల్లి మద్యం దుకాణాలు సింగరాయకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో, టంగుటూరు మండలం ఒంగోలు సర్కిల్ పరిధిలో, మర్రిపూడి మండలం పొదిలి ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలో ఉంటాయి. ఈ మండలాల్లో గత రెండు రోజులుగా 10 గంటల లోపే షాపులు తెరుస్తుండగా కనుమరోజు మాత్రం ఉదయం 7 గంటలకే మద్యం షాపులు తెరిచారు. ఈ మూడు రోజుల్లో భారీగా అమ్మకాలు చేయాలని టార్గెట్ పెట్టుకున్న నిర్వాహకులు అందుకు అనుగుణంగా సమయాలను సైతం మార్చేశారు. కొన్ని దుకాణాలు ఈ మూడు రోజులు 24 గంటలూ గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు సైతం సాగించారన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. అయితే ఎక్సైజ్ శాఖాధికారుల అండదండలు ఉండటంతోనే ఇష్టం వచ్చినట్లు అమ్మకాలు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిన అధికారులు ఈ విధంగా మామూళ్ల మత్తులో పట్టీపట్టనట్లు వ్యవహరించటం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నా పట్టించుకోవటం లేదని దీంతో గ్రామాల్లో తరచు మందుబాబులు కారణంగా అల్లర్లు జరగటం సర్వసాధారణంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.



సింగరాయకొండ లో ఉదయాన్నే 9.09 గంటలకు మద్యం షాపులు తెరిచి ఉన్న దృశ్యం

> **ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం:** సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాలను నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటలకే తెరుస్తున్నారు. నేను స్థానికంగా ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాను. కనుమ రోజు ఉదయాన్నే మద్యం దుకాణాలు తెరుస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. కానీ ఇది వాస్తవం కాదు. ఒకవేళ ఎవరైనా ఉయాన్నే షాపులు తెరిస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం.
>
> ఎం శివకుమారి, ఎక్సైజ్ సీఐ, సింగరాయకొండ

వైఎస్సార్ సీపీ క్యాలెండర్ ఆవిష్కరణ



వైఎస్సార్ సీపీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దద్దాల నారాయణ

పీసీపల్లి: వైఎస్సార్ సీపీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ బుధవారం ఆవిష్కరించారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో నిర్వహించిన ఆవిష్కరణ కార్యక్రమంలో తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆరు నెలలకే అన్ని రంగాల్లో విఫలమైందని, రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దిరెడ్డి ఓకేరెడ్డి, సూరా మాల్యాద్రి, శివరామయ్య, గోపవరపు బొర్రారెడ్డి, పరిమి వెంకట్రావ్, మూలె రాజశేఖర్ రెడ్డి, భూమి రెడ్డి కొండారెడ్డి, రైతు సంఘం నాయకులు వెంగళరెడ్డి, గోపవరపు ఎర్రయ్య, మూలె మాల కొండారెడ్డి పాల్గొన్నారు.

కళాకారులను గౌరవించాలి



కళాకారులను సన్మానిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: కళాకారులను గౌరవించడం మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని ఇందిరా కాలనీలో బుధవారం రాత్రి వెంకటేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన చింతమణి నాటకోత్సవాన్ని చైర్మన్ గఫార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పురస్కరించుకుని నాటకోత్సవాలను నిర్వహించడాన్ని కొనియాడారు. కళాకారులను ప్రతి ఒక్కరూ గౌరవించి సహకరించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం కళాకారుల బృందాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాకారుల బృందం నాయకులు చిన్నిగారి కొండలు, బోరింగ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల పంపిణీ

కనిగిరిరూరల్: బొమ్మిరెడ్డి గ్రామ అభ్యుదయ సమితి ఆధ్వర్యంలో మారెళ్ల ప్రసాద్‌రావు జ్ఞాపకార్థం ప్రతిభా పురస్కారాలను బుధవారం అందచేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గతేడాది పదో తరగతిలో 500 మార్కులు పైన సాధించిన విద్యార్థులకు మెడల్స్, ప్రోత్సాహక నగదును ఉపాధ్యాయుడు శ్రీరామ్ మురళీ చేతుల మీదుగా అందచేశారు. కడియాల జోత్స్నకు రూ.10వేలు, గనికల రాజేశ్వరికి రూ.10 వేలు, తూము ప్రియాంక, తూము సుస్మిత, లోకిరెడ్డి శ్రీజ, బొల్లా దివ్యలకు రూ.5 వేలు ప్రోత్సాహక నగదు అందజేశారు.

తెప్పోత్సవం రద్దు

సింగరాయకొండ: కనుమ పండుగను పురస్కరించుకొని ప్రసిద్ధి గాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని భవనాశి కోనేరులో ఏటా నిర్వహించే తెప్పోత్సవాన్ని ఈ ఏడాది రద్దు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో వ్యక్తి మరణించటంతో తెప్పోత్సవం రద్దు చేశామన్నారు. గతంలో భవనాశి చెరువులో నీరు లేక తెప్పోత్సవం జరగని సందర్భాలున్నాయని, అన్ని ఏర్పాట్లు చేసిన తరువాత గ్రామస్తుడు మరణించటంతో తెప్పోత్సవం రద్దు కావడం ఇదే ప్రథమమని గ్రామస్తులు తెలిపారు.

సదస్సును జయప్రదం చేయండి

కనిగిరిరూరల్: వెలిగొండ జలాల సాధన సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు మాట్లాడుతూ వెలిగొండ జలాలతోనే కనిగిరి ప్రాంత ప్రజలకు ఫ్లోరైడ్ సమస్య నుంచి విముక్తి కల్గుతుందన్నారు.